## విద్యార్థుల మృతిపై విచారణ జరిపించాలి

మెట్‌పల్లి రూరల్, ఆగస్టు 11: గురుకుల పాఠశాలల్లో విద్యార్థుల మృతిపై జ్యుడీషియల్ కమిషన్ ఏర్పాటు చేసి హైకోర్టు న్యాయమూర్తితో విచారణ జరిపించాలని సుఖీభవ ఆర్గనైజేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు బొక్కెనపల్లి నాగరాజు డిమాండ్ చేశారు. ఆదివారం ఆయన పెద్దాపూర్ గురుకుల పాఠశాలను పరిశీలించారు. ఆయన వెంట మెట్‌పల్లి రెవెన్యూ డివిజన్ సాధన సమితి అధ్యక్షుడు గట్టయ్య, అంబేద్కర్ యువజన సంఘం సమాఖ్య నాయకుడు అంజయ్య ఉన్నారు. అలాగే, పెద్దాపూర్ గురుకుల పాఠశాలను ప్రజా సంఘాల జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ పేట భాస్కర్ పరిశీలించారు. ఆయన వెంట ప్రజా సంఘాల జేఏసీ నాయకులు గంగారెడ్డి, రాజేందర్, రాజయ్య, లక్ష్మణ్, రాజేశ్, అబ్బాస్, సాజిద్, మధు తదితరులున్నారు.

నమస్తే తెలంగాణ CLASSIFIED
PLOT FOR SALE
★కరీంనగర్ హైవే ఫేస్ ఫేసింగ్‌కి DTCP, ఓపెన్ ప్లాట్స్, బెంగళూరు హైవేకి, అతి దగ్గరలో అతి తక్కువ ధరలకే ప్లాట్స్ అమ్మబడును. బ్యాంక్ లోన్ Available, ఫోన్: 8885731233, 9948033142.
NT- 326217

### గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

Classified Ads
మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం.. మన నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం
4 లైన్ల ప్రకటన కేవలం 200/- మాత్రమే
ప్రతి ఎక్స్‌ట్రా లైన్‌కి 50/- మాత్రమే
3+1 స్కీం కలదు
ప్రకటనల విభాగం...
GST 5% వర్తించును
Cell: 91827 77571
91827 77194

# వంతెనలు పూర్తయ్యేదెన్నడో?

- ముందుకుసాగక పల్లెల మధ్య నిలిచిన రాకపోకలు
- త్వరగా పూర్తి చేయాలని మండల ప్రజల వేడుకోలు

యామాపూర్-ఫకీర్‌కొండాపూర్ గ్రామాల మధ్య నిలిచిపోయిన హైలెవల్ బ్రిడ్జి పనులు

ఇబ్రహీంపట్నం, ఆగస్టు 11: మండలంలోని పలు చోట్ల లోలెవల్ బ్రిడ్జిల నిర్మాణానికి నిధులు మంజూరు కాగా, తొమ్మిది నెలల్లో పూర్తి చేయాలని నిర్ణయించారు. కేవలం యామాపూర్-ఫకీర్‌కొండాపూర్ గ్రామాల మధ్య వంతెన నిర్మాణ పనులు మాత్రమే మొదలు పెట్టారు. ఈ పనులు సైతం నత్తనడకన సాగుతున్నాయి. దీంతో వానకాలంలో పలు పల్లెలకు రాకపోకలు నిలిచిపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అప్పటి కోరుట్ల ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు చొరవతో యామాపూర్, ఫకీర్‌కొండాపూర్ గ్రామాల హైలెవల్ వంతెనకు రూ.4 కోట్లు, కోమటికొండాపూర్-ఎర్రండి గ్రామాల మధ్య హైలెవల్ వంతెనకు రూ.2 కోట్లు, తిమ్మాపూర్-యామాపూర్ గ్రామాల లోలెవల్ వంతెనకు రూ. 80 లక్షలు, వర్షకొండ-ఇబ్రహీంపట్నం గ్రామాల మధ్య రెండు లోలెవల్ వంతెనలకు రూ.3.30 కోట్ల చొప్పున నిధులు మంజూరు చేయించారు. 2023లో పనులకు భూమిపూజ చేశారు. పనులు దక్కించుకున్న కాంట్రాక్టర్లు 9 నెలల్లో పూర్తి చేయాల్సి ఉన్నా ఇప్పటి వరకు మొదలు పెట్టలేదు. కేవలం యామాపూర్-ఫకీర్‌కొండాపూర్ గ్రామాల మధ్య వంతెన నిర్మాణ పనులు చేపట్టగా బిల్లులు రాకపోవడంతో అర్ధాంతరంగా నిలిపివేశారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు అక్కడ తాత్కాలికంగా వేసిన రోడ్డు కొట్టుకపోడంతో రెండు గ్రామాల మధ్య రాకపోకలు నిలిచిపోయాయి. వర్షకొండ-ఇబ్రహీంపట్నం గ్రామాల మధ్య చిన్నపాటి వర్షానికి రొడ్డాములు పొంగిపొర్లడంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడుతుంది. అయితే పనులు దక్కించుకున్న కాంట్రాక్టర్లు ఇప్పటి వరకు పనులు మొదలు పెట్టకపోవడం, అధికారులు చూసీచూడనట్లుగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. అధికారులు స్పందించి వంతెనల నిర్మాణ పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

### పట్టణానికి వెళ్లాలంటే ఇబ్బందిపడుతున్నం

చిన్నపాటి వర్షానికే రొడ్డాం పొంగిపొర్లడంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడి తీవ్ర ఇబ్బందులు పడుతున్నం. వానకాలంలో రోగాల బారీన పడితే పట్టణంలోని పెద్దాసుపత్రికి వెళ్లాలంటే తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నం.

**- సల్కం గంగముత్తు, వ్యవసాయ కూలీ, వర్షకొండ**

### పనులు పూర్తి చేయాలి

వ్యవసాయ చేలకు వెళ్లాలంటే రొడ్డాంలు పొంగిపొర్లినప్పుడు దాటేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నం. నిధులు మంజూరయ్యాయని సంతోషపడితే కాంట్రాక్టర్లు మాత్రం పనులు చేయకపోవడంతో తిప్పలు తప్పడం లేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పనులు త్వరగా పూర్తి చేయాలి.

**- చెదలు గంగాధర్, రైతు, యామాపూర్**

# కెపాసిటర్ల బిగింపుతో బహుళ ప్రయోజనం

- ట్రాన్స్‌కో మెట్‌పల్లి ఏడీఈ మనోహర్

కెపాసిటర్లు కొనుగోలు చేసిన రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏడీఈ మనోహర్

మెట్‌పల్లి రూరల్, ఆగస్టు 11: అన్నదాతలు వ్యవసాయ మోటార్లకు కెపాసిటర్లు బిగించకుంటే బహుళ ప్రయోజనం ఉంటుందని ట్రాన్స్‌కో మెట్‌పల్లి ఏడీఈ మనోహర్ పేర్కొన్నారు. 20 శాతం విద్యుత్ ఆదాతో పాటు వ్యవసాయ మోటారు, ట్రాన్స్‌ఫార్మర్ కాలిపోకుండా ఉంటుందన్నారు. మెట్‌పల్లి మండలం వెల్లుల్ల గ్రామంలో 1200 వ్యవసాయ పంపుసెట్లకు నాణ్యమైన కెపాసిటర్లను తెప్పించుకొని బిగింపునకు స్వచ్ఛందంగా ముందుకు వచ్చారు. కాగా, ఆదివారం వెల్లుల్లలో ఏడీఈ మనోహర్ ఒక పంపుసెట్‌కు కెపాసిటర్ బిగించి ప్రయోజనాలను ప్రత్యక్షంగా అవగాహన కల్పించారు. ఒక్కో పంపుసెట్‌కు ఏడాదికి సుమారు రూ. 25 వేల విద్యుత్ వినియోగమవుతుందని, కెపాసిటర్ బిగించుకుంటేతే రూ.5వేలు ఆదా అవుతుందని వివరించారు. వెల్లుల్లలో 1200 పంపుసెట్లకు కెపాసిటర్ల బిగింపు పూర్తయితే దాదాపు రూ. 60 లక్షలు ఆదా చేసినవారవుతారని అభినందించారు. వెల్లుల్ల రైతులను మిగతా గ్రామాల అన్నదాతలు ఆదర్శంగా తీసుకొని కెపాసిటర్ల బిగింపునకు ముందుకు రావాలని కోరారు. కార్యక్రమంలో సబ్ ఇంజినీర్ నవీన్, సిబ్బంది శ్రీధర్, శివ, జలపతి, రాజేశ్, దిలీప్, రైతులు పాల్గొన్నారు.

## బీజేపీ నాయకుల సమావేశం

మల్యాల, ఆగస్టు 11: ఎన్నికల్లో పోటీ చేసిన ప్రతీసారి ఓడిపోయిన వ్యక్తి వెలిచాల రాజేందర్‌రావు అని, కనీసం కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ అభివృద్ధి, సమస్యలపై అవగాహన లేకుండా మాట్లాడుతున్నారని బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు సింగిరెడ్డి కృష్ణారెడ్డి పేర్కొన్నారు. మండల కేంద్రంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో బీజేపీ మండలాధ్యక్షుడు నేరేళ్ల శ్రవన్‌రెడ్డి అధ్యక్షతన పార్టీ ముఖ్య నాయకులతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేయగా, ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కృష్ణారెడ్డి మాట్లాడుతూ, మనోహరాబాద్ నుంచి సిద్దిపేట వరకు ఇప్పటికే రైలు మార్గం పూర్తయిందని, మరో 75 కిలోమీటర్ల మేర సిరిసిల్ల-కరీంనగర్ వరకు రైలు మార్గం పూర్తి కావాల్సి ఉందన్నారు. ఈ 75 కిలోమీటర్ల మేర ఎర్త్‌వర్క్ పనులు శరవేగంగా జరుగుతున్నాయని, రాష్ట్ర ప్రభుత్వం 250 ఎకరాల భూమితో పాటు రాష్ట్ర ప్రభుత్వ వాటా చెల్లించినట్లయితే రాబోయే 18 నెలల్లో పనులు పూర్తి చేస్తామన్నారు. కొండగట్టు పుణ్యక్షేత్రం వరకు ఇప్పటికే రైలు మార్గం పూర్తయిందని, జగిత్యాల నుంచి వరంగల్ వరకు నాలుగు వరుసల రహదారి మంజూరైనట్లు పేర్కొన్నారు. వాటికి సంబంధించి టెండర్ ప్రక్రియ కొనసాగుతున్నట్లు తెలిపారు. కానీ, వెలిచాల రాజేందర్‌రావు నిధులు మంజూరు చేయడం లేదని కేంద్ర మంత్రి బండి సంజయ్‌ను విమర్శించడం సరికాదన్నారు. సమావేశంలో మల్లేశం, వెంకటస్వామి, తదితరులు పాల్గొన్నారు.

## ఇండ్ల స్థలాలు కేటాయించాలి

జగిత్యాల, ఆగస్టు 11: జర్నలిస్టులకు ఇండ్ల స్థలాలు కేటాయించాలని ఎస్టీయూ నేతలు రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు ఆదివారం హైదరాబాద్‌లో తెలంగాణ ప్రెస్ అకాడమీ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఇక్కడ ఎస్టీయూ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పర్వతరెడ్డి, సదానందంగౌడ్, రాష్ట్ర కార్యదర్శి రవీందర్, జగిత్యాల జిల్లా ప్రధాన కార్యదర్శి బైరం హరికిరణ్, పాలేపు శివ రామకృష్ణ తదితరులున్నారు.

## విద్యార్థినికి సత్కారం

సారంగాపూర్, ఆగస్టు 11: ఉస్మానియా యూనివర్సిటీ ఎంట్రన్స్ (బాటనీ విభాగం)లో రేచపల్లి గ్రామానికి చెందిన బాస గంగోత్రి 14వ ర్యాంక్ సాధించింది. గంగోత్రిని ఆదివారం కాంగ్రెస్ మండల నాయకులు అభినందించి, సన్మానించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు కోండ్ర రాంచందర్ రెడ్డి, మోత్కూరి ప్రసాద్ గౌడ్, బొడుగం తిరుపతి రెడ్డి, ఆశాది రాజన్న, గౌడశెట్టి రాజన్న, బేర మహేశ్, దీటి సురేశ్, సుబ్రహ్మణ్యం, సుంకం జగన్, బాస గంగమల్లు, ఆశన్న, హరీశ్ పాల్గొన్నారు.

## విద్యావ్యవస్థను విస్మరించిన కాంగ్రెస్

మారుతీనగర్, ఆగస్టు 11: కాంగ్రెస్ ప్రభుత్వం విద్యావ్యవస్థను విస్మరిస్తున్నదని బీసీ విద్యార్థి సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు జెట్టి నరేంద్ర పేర్కొన్నారు. పట్టణంలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి 9 నెలలు గడుస్తున్నప్పటికీ విద్యాశాఖ మంత్రిని కేటాయించకపోవడం ఇందుకు నిదర్శనమని అన్నారు. పెద్దాపూర్ గురుకుల పాఠశాలలో ఇటీవల మృతి చెందిన విద్యార్థుల కుటుంబాలకు రూ.50 లక్షల చొప్పున పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఆయన వెంట విద్యార్థి సంఘం నాయకులు పంచకోటి రవి, మనోజ్, వెంకటేశ్, అజయ్, నిఖిల్, వర్మ, రాజేశ్ తదితరులున్నారు.

## ఆలయ పునర్నిర్మాణానికి దాతలు సహకరించాలి

మారుతీనగర్, ఆగస్టు, 11 : మార్కండేయ ఆలయ పునర్నిర్మాణానికి దాతలు సహకరించాలని పద్మశాలీ సంఘం పట్టణాధ్యక్షుడు ద్యావనపెల్లి రాజారాం పిలుపునిచ్చారు. పట్టణానికి చెందిన స్వర్గం రమేశ్ కుటుంబంతో సహా దుబాయ్‌లో నివసిస్తున్నాడు. ఇటీవల మెట్‌పల్లికి రాగా మార్కండేయ ఆలయ పునర్నిర్మాణానికి విరాళాలు సేకరిస్తున్నారని తెలుసుకొని స్వచ్ఛందంగా వచ్చి దుబాయ్‌లోని పద్మశాలీల నుంచి విరాళాలను సేకరించి పంపిస్తానని హామీ ఇచ్చారు. అనంతరం పద్మశాలీ సంఘ సభ్యులు ఆయనను శాలువా, జ్ఞాపికతో సత్కరించారు. కార్యక్రమంలో పద్మశాలీ సంఘం సభ్యులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## భారీ వర్షాలకు కూలిన ఇండ్లు

పెగడపల్లి, ఆగస్టు 11: మండలంలో ఆదివారం తెల్లవారు జామున కురిసిన భారీ వర్షానికి నాలుగు ఇండ్లు కూలినట్లు తహసీల్దార్ శ్రీనివాస్ తెలిపారు. బతికపల్లికి చెందిన ఎగుర్ల లచ్చవ్వ, గణాచారి భూమక్క, మద్దులపల్లికి చెందిన అంకమల్ల శంకర్, గన్నెబోయిన దేవమ్మ పెంకుటిళ్లు కూలినట్లు వివరించారు. ఆర్ఐలు శ్రీనివాస్, జమున కూలిన ఇండ్లను పరిశీలించారని, బాధితులకు పరిహారం వచ్చేలా కలెక్టర్‌కు నివేదించనున్నట్లు పేర్కొన్నారు.

## ఐతుపల్లిలో నాలుగు మేకలు మృతి

పెగడపల్లి, ఆగస్టు 11: మండలంలోని ఐతుపల్లిలో ఆదివారం వరి పొలంలో విషపు నీళ్లు తాగి పలుమారు అంజయ్యకు చెందిన నాలుగు మేకలు మృతి చెందాయి. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం.. ఆదివారం మేకలను గ్రామ శివారులోకి మేతకు తీసుకెళ్లినట్లు తెలిపారు. తెగుళ్ల నివారణకు పురుగుల మందు పిచికారీ చేసిన వరి పొలంలో నీళ్లు తాగిన మేకలు కొద్ది సేపటికే కింద పడిపోయి మృతి చెందినట్లు తెలిపాడు. ప్రభుత్వం ఆర్థిక సాయం చేసి ఆదుకోవాలని అంజయ్య కోరుతున్నారు.

## ఎన్ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడి ఆత్మహత్య

కోరుట్ల, ఆగస్టు 11: పట్టణానికి చెందిన ఎన్ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడు సదుల వినయ్ (27) పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. బంధువులు తెలిపిన వివరాల ప్రకారం.. వినయ్ వ్యక్తిగత కారణాలతో శనివారం రాత్రి పురుగుల మందు తాగాడు. కుటుంబసభ్యులు స్థానికంగా ఉన్న ఓ ప్రైవేట్ దవాఖానలో చికిత్స అందించారు. పరిస్థితి విషమించడంతో మెరుగైన చికిత్స కోసం కరీంనగర్‌కు తరలించారు. చికిత్స పొందుతూ వినయ్ ఆదివారం మృతి చెందాడు. కాగా, ప్రేమించిన యువతి దూరమైందనే బాధతో మనస్తాపానికి గురై ఆత్మహత్య చేసుకున్నట్లు తెలిసింది.

## సుదూర ప్రాంతాలకు వెళ్తే సమాచారం ఇవ్వాలి

మల్యాల, ఆగస్టు 11: మండల ప్రజలు ఇంటికి తాళం వేసి ఊరికి వెళ్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలని ఎస్ఐ నరేశ్‌కుమార్ ఒక ప్రకటనలో కోరారు. తమ సిబ్బందితో గస్తీ నిర్వహిస్తామని పేర్కొన్నారు. అనుమానాస్పద వ్యక్తులు కనిపిస్తే డయల్ 100కు సమాచారం ఇవ్వాలని కోరారు.

## దవాఖాన నుంచి 'గురుకులం' విద్యార్థి డిశ్చార్జి

మెట్‌పల్లి రూరల్, ఆగస్టు 11: మెట్‌పల్లి మండలం పెద్దాపూర్ బాలుర గురుకుల పాఠశాలలో రెండు రోజుల క్రితం అస్వస్థతకు గురై నిజామాబాద్‌లో చికిత్స పొందుతున్న విద్యార్థి అల్లి హేమంత్‌యాదవ్ దవాఖాన నుంచి ఆదివారం డిశ్చార్జి అయ్యారు. మల్యాల మండలం తాటిపెల్లికి చెందిన హేమంత్ ఆరోగ్య పరిస్థితి మెరుగవడంతో వైద్యులు డిశ్చార్జి చేశారు. కాగా అస్వస్థకు గురైన మరో విద్యార్థి మెట్‌పల్లి మండలం ఆత్మకూర్‌కు చెందిన మొండి మోక్షిత్ ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉండడంతో ఐసీయూ నుంచి జనరల్ వార్డుకు మార్చినట్లు వైద్యులు తెలిపారు.

## బాధిత కుటుంబానికి పరామర్శ

జగిత్యాల రూరల్, ఆగస్టు 11: జగిత్యాల అర్బన్ మండలం ధరూర్ గ్రామానికి చెందిన కొండపలుకుల ఆండాలమ్మ మృతిచెందగా, ఆదివారం బాధిత కుటుంబాన్ని ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ పరామర్శించారు. ఆయన వెంట నాయకుడు ఆనందరావు, తదితరులున్నారు.

## అభివృద్ధి నిరంతర ప్రక్రియ

లబ్ధిదారుకు సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే సంజయ్ కుమార్

సారంగాపూర్, ఆగస్టు 11: అభివృద్ధి అనేది నిరంతర ప్రక్రియ అని ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్ పేర్కొన్నారు. బీర్‌పూర్ మండలం కొల్వాయి లోని రామాలయం కల్యాణ మండపంలో ఆదివారం ఆయన మండలానికి చెందిన 86 మంది లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ మాట్లాడుతూ, జగిత్యాల నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తానని పేర్కొన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా ఏక కాలంలో రూ. 31 వేల కోట్లు రుణమాఫీ చేసిన ఘనత సీఎం రేవంత్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీకి దక్కుతుందన్నారు. కార్యక్రమంలో కేడీసీసీబీ డైరెక్టర్ ముప్పాల రాంచందర్ రావు, నాయకులు నారపాక రమేశ్, మోసు ఏసుదాసు, ప్రభాకర్, వెంకటేశ్, నరేందర్, సాగర్, రమేశ్, శ్రీను, మారుతి, శ్రీనివాస్ రావు, ఎలగందుల అశోక్, అగస్టిన్, సతీశ్, చంద్రయ్య పాల్గొన్నారు.

## ముగిసిన శ్రావణ సప్తాహ ఉత్సవాలు

ఆలయంలో పూజలు చేస్తున్న అర్చకులు, వేదపండితులు, పాలకమండలి సభ్యులు

మల్యాల, ఆగస్టు 11: కొండగట్టు అంజన్న ఆలయంలో నిర్వహిస్తున్న శ్రావణ సాప్తాహ ఉత్సవాలు ఆదివారం ముగిశాయి. ఆలయంలో అర్చకులు, వేదపండితులు ప్రత్యేక పూజలు నిర్వహించడంతో పాటు 108 కలశాలతో స్వామి వారికి ప్రత్యేక అభిషేకం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ స్థానాచార్యులు కఫీందర్, ప్రధాన అర్చకులు రామకృష్ణ, జితేంద్ర ప్రసాద్, ఉపప్రధాన అర్చకుడు చిరంజీవస్వామి, వేదపండితులు రాజేశ్వర్‌శర్మ, పెద్దన్న శర్మ, తేజేశ్వర్, ఆలయ ఏఈవో వైరాగ్యం అంజయ్య పాల్గొన్నారు.

## వైభవంగా స్వాతి నక్షత్ర పూజలు

ధర్మపురి, ఆగస్టు 11: ధర్మపురి లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో ఆదివారం స్వాతి నక్షత్ర పూజలు వైభవంగా నిర్వహించారు. స్వామి వారి జన్మ నక్షత్రమైన స్వాతి నక్షత్రాన్ని పురస్కరించుకొని విశేష పూజలు సంప్రదాయ పద్ధతిలో నిర్వహించారు. శ్రావణమాసం సందర్భంగా ఆలయానికి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. మొదట గోదావరి నదిలో స్నానాలాచరించి సంకల్పాది పూజలు జరిపించుకున్నారు. అనంతరం ప్రధాన ఆలయంతో పాటు అనుబంధ ఆలయాల్లో స్వామివారలను దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులు ఇబ్బందులు పడకుండా సిబ్బంది ఏర్పాట్లు చేశారు.

## నిరుపేదలకు ఉచిత కంటి శస్త్ర చికిత్సలు

జగిత్యాల రూరల్, ఆగస్టు 11: జగిత్యాలలో పావని కంటి దవాఖాన, ఆపీ, రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం నియోజకవర్గంలోని 17 మంది నిరుపేదలకు ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ ఉచితంగా కంటి శస్త్ర చికిత్సలు నిర్వహించారు. కార్యక్రమంలో డాక్టర్ విజయ్, నాయకులు నాగయ్య, మహేశ్, దవాఖాన సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

కథలాపూర్, ఆగస్టు 11: మండల కేంద్రంలో పలువురికి సీఎంఆర్ఎఫ్ ద్వారా ఆర్థిక సాయం మంజూరు కాగా, ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ ఆదివారం లబ్ధిదారులకు చెక్కులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండలాధ్యక్షుడు నాగరాజు, నాయకులు పులి హరిప్రసాద్, వెలిచాల సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

## బీజేపీ కౌన్సిలర్‌పై కేసు

కోరుట్ల, ఆగస్టు 11: పట్టణానికి చెందిన బీజేపీ కౌన్సిలర్ మాడవేణి నరేష్‌పై ఆదివారం పోలీసులు కేసు నమోదు చేశారు. సోషల్ మీడియా వాట్సాప్ గ్రూప్‌లో నరేష్ అసభ్యకరమైన వీడియోను పోస్ట్ చేయడంతో అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ కిరణ్‌కుమార్ తెలిపారు.

## ఉచిత మెగా వైద్య శిబిరం

మెట్‌పల్లి రూరల్, ఆగస్టు 11: జగ్గసాగర్ గ్రామంలో ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ సూచనతో వైద్యారోగ్య శాఖ ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు. గ్రామంలో ఇంటింటికీ వెళ్లి జ్వర పీడితులను గుర్తించారు. 2,342 మంది గ్రామస్తులకు వివిధ పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. కార్యక్రమంలో వైద్యులు లత, నిఖిల, నాగార్జున, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

## సంఘాలు-కార్యవర్గాలు

మెట్‌పల్లి, ఆగస్టు 11: మెట్‌పల్లి పట్టణ గంగపుత్ర బెస్త సంఘం నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా మానుకల చిన్నయ్య, ఉపాధ్యక్షుడిగా పోచయ్య, ప్రధాన కార్యదర్శిగా పర్రె వినోద్, సహాయ కార్యదర్శిగా పారిపెల్లి కిషన్, కోశాధికారిగా చింతకింది సురేశ్, ముఖ్యసలహాదారులుగా పర్మి నర్సయ్య, సాయన్న, కార్యవర్గసభ్యులుగా గంగాధర్, రాజ్‌కుమార్, రమేశ, పారిపెల్లి శంకర్, కాశేణి పెద్దులు, శంకర్, ప్రకాశ్, శ్రీనివాస్, కిశోర్, గోపాల్, గంగాధర్ ఎన్నికయ్యారు. అలాగే, నూర్ బాషా సంఘం (ముస్లిం) అధ్యక్షుడిగా అబ్దుల్ రబ్ ఎన్నికయ్యారు. సంఘం సభ్యులు సమీయొద్దీన్, నిజాం, అజీజ్, నయూమ్ పాల్గొన్నారు.

కోరుట్ల రూరల్, ఆగస్టు 11: సర్వాయి పాపన్న గీత కార్మిక సంఘం మండలాధ్యక్షుడిగా బొల్లపెల్లి రాజలింగం గౌడ్, జిల్లా ఉపాధ్యక్షుడిగా నగునూరి గంగాధర్‌గౌడ్‌ను నియమిస్తూ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు రాజేశ్వర్‌గౌడ్ నియామక పత్రం ఇచ్చారు. సంఘం జిల్లా అధ్యక్షుడు చంద్రశేఖర్ గౌడ్, నియోజకవర్గ అధ్యక్షుడు శ్రీనివాస్‌గౌడ్, గ్రామాధ్యక్షుడు ప్రసాద్ గౌడ్, నాయకులు రాజనర్సయ్య, నారాయణగౌడ్, నరేశ్, రామాగౌడ్, సత్యనారాయణగౌడ్, శ్రీనివాస్, రాజేందర్, సభ్యులు పాల్గొన్నారు.

మేడిపల్లి, ఆగస్టు 11: మండల కేంద్రంలోని మార్కండేయ పద్మశాలీ సంఘ భవనంలో ఆదివారం సంఘం నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా మ్యాకల రాజేశం, ఉపాధ్యక్షుడిగా దీకొండ గంగాధర్, కార్యదర్శిగా బండారి మహేశ్, సహాయ కార్యదర్శిగా రాంపెల్లి మురళి, కోశాధికారిగా మ్యాకల కిశోర్‌కుమార్ ఎన్నికయ్యారు.

## జర్నలిస్టులకు ఇండ్ల స్థలాలు కేటాయించాలి

జగిత్యాల రూరల్, ఆగస్టు 11: జర్నలిస్టులకు ఇండ్ల స్థలాలు కేటాయించాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి ముసిపట్ల లక్ష్మీనారాయణ రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. జగిత్యాలలో జర్నలిస్టులు చేపట్టిన దీక్షకు ఆదివారం ఆయన సంఘీభావం ప్రకటించి, మాట్లాడారు. కార్యక్రమంలో సంఘం నాయకులు అలిశెట్టి ఈశ్వరయ్య, తదితరులు పాల్గొన్నారు.

## మున్నూరుకాపు సంఘం జిల్లా అధ్యక్షుడికి సత్కారం

కథలాపూర్, ఆగస్టు 11: కథలాపూర్ మండలం గంభీర్‌పూర్ గ్రామంలో మున్నూరుకాపు సంఘం జిల్లా అధ్యక్షుడు చెదలు సత్యనారాయణను ఆదివారం గ్రామ మున్నూరుకాపు సంఘం ఆధ్వర్యంలో సన్మానించారు. కార్యక్రమంలో సంఘం ప్రతినిధులు వెలిచాల సత్యనారాయణ, ఆకుల నర్సయ్య, శ్రీనివాస్, సాయికృష్ణ, చౌదరి, తదితరులు పాల్గొన్నారు.

## పేద విద్యార్థినికి చేయూత

సారంగాపూర్, ఆగస్టు 11: బీర్‌పూర్‌కు చెందిన గుండ నందిని బాసర ట్రిపుల్ ఐటీలో సీటు సాధించగా అడ్మిషన్ ఫీజు, కళాశాలకు వెళ్లేందుకు రవాణా ఖర్చుల కోసం ప్రధానోపాధ్యాయుడు సంగనబట్ల నర్సింహ మూర్తి ఆర్థికం సాయం అందించారు. అలాగే, కళాశాలలో తప్పనిసరిగా మొబైల్ ఫోన్ అవసరమని చెప్పడంతో బీర్‌పూర్ పాఠశాల ఉపాధ్యాయుల సహకారంతో రూ. 14 వేల విలువైన ఫోన్‌ను ఆదివారం నందినికి అందజేశారు.

## పద్మశాలీ సంఘానికి స్థలం కేటాయించాలని వినతి

మల్యాల, ఆగస్టు 11: మల్యాల మండల పద్మశాలీ సంఘం కోసం ముత్యంపేట గ్రామపంచాయతీ పరిధిలో గల సర్వేనంబర్ 595లో ఎకరం భూమి కేటాయించాలని చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యంకు ఆదివారం సంఘం నాయకులు వినతి పత్రం అందజేశారు. పద్మశాలీ సంఘం నాయకుడు మల్లయ్య, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

## రిపేర్‌కు ఇచ్చిన ఫోన్ ఇవ్వలేదని ఆత్మహత్యాయత్నం

జగిత్యాల కలెక్టరేట్, ఆగస్టు 11: రిపేర్‌కు ఇచ్చిన సెల్ ఫోన్‌ను సెల్ పాయింట్ వ్యక్తి తిరిగివ్వడంలేదని ఓ వ్యక్తి ఆత్మహత్యాయత్నం చేశాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మొబైల్ ఫోన్ చెడిపోవడంతో రమేశ్ అనే వ్యక్తి పట్టణంలోని కొత్త బస్టాండ్ సమీపంలో గల ఓ సెల్ పాయింట్‌లో రిపేర్‌కు ఇచ్చాడు. మూడు రోజులు గడుస్తున్నా ఫోన్ రిపేర్ చేసి ఇవ్వకపోవడంతో సెల్ పాయింట్ యజమానిని రమేశ్ ఆదివారం నిలదీశాడు. దీంతో ఇద్దరి మధ్య గొడవ జరిగింది. దీంతో మనస్తాపం చెందిన రమేశ్ జగిత్యాల కొత్త బస్టాండ్‌లో బ్లేడ్‌తో చేతిని కోసుకొని ఆత్మహత్యాయత్నం చేశాడు. 108లో జగిత్యాల ప్రభుత్వ దవాఖానకు తరలించారు.

SBI స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా
కార్గిల్ చౌక్ శాఖ- 20137, కోరుట్ల, జగిత్యాల జిల్లా-505326

స్వాధీనతా ప్రకటన రూల్ 8(1) మరియు (2) క్రింద (స్థిరాస్తి కొరకు)

దిగువ సంతకందారు **స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, కార్గిల్ చౌక్ శాఖ-20137, కోరుట్ల** అధీకృత అధికారిగా సెక్యూరిటైజేషన